రాష్ట్రంలో జనరంజక పాలన

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గార్లదిన్నె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల,మతాలు, రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కల్లూరు అగ్రహారం, కల్లూరులో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరయ్యారు. మొదటగా కల్లూరు అగ్రహారం నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక బస్టాండ్ సర్కిల్లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ


కల్లూరులో సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావించి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజాదరణ పొందడంతో 2024లో 175 స్థానాలకు 175 స్థానాలు గెలిచి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. నాడు–నేడు కార్యక్రమం చేపట్టి ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మార్చారన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేవి కావని, వైఎస్సార్ ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు కొత్త డ్రామాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు వారిని నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి, పాలిఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరంధామ, నాయకులు బృందావన్ రామాంజనేయులు, చీమల కేశవయ్య, చీమల రామకృష్ణ, చితంబరరెడ్డి, చీమల శ్రీనివాసులు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రసాద్, ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మాబు, రవి, శ్రీనివాసులు, కొండాయాదవ్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

నేడు గుత్తి రైల్వే స్టేషన్ 157వ వార్షికోత్సవం

గుత్తి: గుత్తి రైల్వే స్టేషన్ 157వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని, రైల్వే అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలని కోరారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని డీఆర్‌ఎంకు ఎంపీ లేఖ

గుత్తి: గుత్తి రైల్వే స్టేషన్‌లో అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని గుంతకల్లు డీఆర్‌ఎం మనీష్ తివారికి అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య శనివారం లేఖ రాశారు. గతంలో అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ రైళ్లు గుత్తిలో ఆగేవని, గత కొంత కాలంగా కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఆపడం లేదన్నారు. కుర్లా, కర్ణాటక, అహ్మదాబాద్, వైపీఆర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు గుత్తిలో స్టాపింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే యూనిట్ ఆసుపత్రిలో వైద్యులను నియమించాలని, లిఫ్ట్‌లకు మరమ్మతు పనులు చేయించాలని, అదనపు ప్లాట్ ఫారం నిర్మాణ పనులను వేగవంతం చేయించాలని లేఖలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

పైప్‌లైన్ మరమ్మతు పనుల పరిశీలన


పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న నాయకులు

గుత్తి: పామిడి నుంచి గుత్తికి నీటిని సరఫరా చేసే సత్యసాయి వాటర్ పైప్‌లైన్ మరమ్మతు పనులను శనివారం వైఎస్సార్‌సీపీ గుత్తి ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు వరదరాజులు, వాల్మీకి శివ, అరవింద్ బాబు, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి పరిశీలించారు. మమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను సూచించారు.

జూనియర్ కళాశాలను సందర్శించిన ఎంపీపీ


అధ్యాపకులతో మాట్లాడుతున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను శనివారం ఎంపీపీ విశాలాక్షి, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి సందర్శించారు. కొన్ని రోజులుగా ప్రిన్సిపాల్ ప్రవర్తనపై అధ్యాపకులు, విద్యార్థులు ఆందోళన నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ సందర్భంగా వారు ప్రిన్సిపాల్ సంజిత్ నాయక్, అధ్యాపకులు, విద్యార్థులను వేర్వేరుగా విచారించారు. న్యాయం చేస్తామని అధ్యాపకులు, విద్యార్థులకు ఎంపీపీ హామీ ఇచ్చారు.

సమయపాలన పాటించండి

తాడిపత్రిటౌన్: సమయపాలన పాటించాలని ఎంపీడీఓ రంగారావు సచివాలయ సిబ్బందికి సూచించారు. గన్నెవారిపల్లిలో శనివారం ఆయన సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని సూచించారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు


గాయపడిన ఖాదర్‌వలి

యల్లనూరు: యల్లనూరు గ్రామ సచివాలయం–2లో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఖాదర్‌వలి విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. కోడిమూర్తి గ్రామ ఫీడర్‌లోని యల్లనూరు వ్యవసాయ పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ హెడ్ ఫీజు వేసేందుకు వెళ్లాడు. ఎల్‌సీ తీసుకున్నానని అనుకొని పొరపాటున విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన చుట్టపక్కల రైతులు సబ్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి సరఫరా ఆపేయించారు. తీవ్రగాయాలతో బయటపడిన ఖాదర్‌వలిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు బెంగళూరు తీసుకెళ్లారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించండి


మాట్లాడుతున్న రామలింగప్ప

గుంతకల్లుటౌన్: ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.రామలింగప్ప, పార్టీ యువనేత సిబి.మంజునాథరెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సూచించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీకి చెందిన కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బూత్‌లెవెల్ ఏజెంట్లు, పార్టీ క్రియాశీలక కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండేలా చూడటమే కాకుండా జగనన్న చేసిన మేలును వివరించి వారి మద్దతు పొందాలన్నారు. జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, పోలింగ్ బూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని వారు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బి.సుంకప్ప, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజనేయులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

గుంతకల్లుటౌన్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, మైమూన్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 26వ వార్డులో మాజీ కౌన్సిలర్ బి.సుంకప్పతో కలిసి వారు గడపగడపకూ తిరుగుతూ ప్రజల యోగక్షేమాలు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధిని ఆరా తీశారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరగా, వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న జనరంజక పాలన సాగిస్తున్నారని వారు ప్రజలకు వివరించారు. జగనన్నకు మరోసారి మీ చల్లని దీవెనలందించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో


ప్రజల సమస్యలపై ఆరాతీస్తున్న చైర్‌పర్సన్ భవానీ, వీసీలు నైరుతి, మైమూన్

వైఎస్సార్‌సీపీ యువనేత సిబి.మంజునాథరెడ్డి, వార్డు మాజీ కౌన్సిలర్ బి.లక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్లు రామలింగప్ప, రామాంజనేయులు, పార్టీ పట్టణాధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, వార్డు ఇన్‌చార్జ్‌లు, అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రోల్‌బాల్ పోటీలకు ఎంపిక

తాడిపత్రి అర్బన్: రాష్ట్రస్థాయి రోల్‌బాల్ పోటీలకు తాడిపత్రికి చెందిన 21 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన అండర్ 14, 17 విభాగాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో తాడిపత్రికి చెందిన తరుణ్ కుమార్, అనికుమార్‌రెడ్డి, శ్రీహరి, అష్రాఫ్, పృథ్వీ, రామ్, చరణ్, యోగేంద్ర, హర్షవర్ధన్, సూర్యప్రకాష్, చిన్న కుళ్లాయప్ప, అభిరామ్, ధర్మపాల్ రెడ్డి, అభిజిత్, హిమధర్, నివాస్‌రెడ్డి, కుమార్, మహేష్, శ్రీరామ్, భార్గవ్, దత్త స్వరూప ప్రతిభ కనబరిచారు. దీంతో నిర్వాహకులు వారిని


రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ పోటీలకు ఎంపికైన తాడిపత్రి విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కోచ్ మధు తెలిపారు.

రోటరీపురంలో నిరుద్యోగులకు శిక్షణ

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్యాంపస్ కోఆర్డినేటర్ భార్గవ్ శనివారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు డ్రైవింగ్, టైలరింగ్,మొబైల్ రిపేరీ, కంప్యూటర్ బేసిక్స్, బ్యూటీషియన్స్, మెహందీ వంటి వాటిలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ సమయంలో భోజనం, వసతి కల్పిస్తున్నామని తెలిపారు. వివరాలకు 9701241487 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సీఐ నరేంద్రరెడ్డిని సస్పెండ్ చేయాలి

గుత్తి: ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు నిర్మల మాట్లాడుతూ ఐదు రోజుల క్రితం కల్లూరులో గుడిసె బాధితులు, సీపీఎం నాయకులపై సీఐ నరేంద్ర రెడ్డి దురుసుగా ప్రవర్తించడంతో పాటు దాడి చేశారన్నారు. వెంటనే విచారణ చేసి సీఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సీఐపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం సీనియర్ నేత రేణుకమ్మ, కేవీపీఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు కవిత పాల్గొన్నారు.

ఓటరు నమోదు సమర్థవంతంగా నిర్వహించండి

గుంతకల్లు రూరల్: ఓటరు నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఓటరు నమోదు అధికారి, ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి బీఎల్వోలకు సూచించారు. శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా పలు ప్రాంతాల్లో ఆయన ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించడంతోపాటు పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. ఓటరు నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను బీఎల్వోలకు తెలియజేశారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. ఇందులో భాగంగా కొత్తగా ఓటరు నమోదుకు 59 మంది, ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆదివారం కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


బీఎల్వోలకు సూచనలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలో శనివారం ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని తహసీల్దార్ మహబూబ్ బాషా పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ సందీప్, వీఆర్వో రంగయ్య, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంతో నైపుణ్యాలు మెరుగు

అనంతపురం: నూతన జాతీయ విద్యా విధానంతో నైపుణ్యాలు మెరుగుపడతాయని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో ఆరు రోజులుగా హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో 'నూతన జాతీయ విద్యావిధానం – సాధికారిత' అనే అంశంపై అధ్యాపకులకు ఏఐసీటీఈ ట్రైనింగ్, లర్నింగ్ (అటల్) శిక్షణ కల్పించారు. శనివారం ముగింపు కార్యక్రమానికి వీసీ హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం అకడమిక్ అంశాలతో పాటు నైపుణ్యాలకు ఎంతో ముఖ్య పాత్ర ఉందన్నారు. నూతన జాతీయ విద్యా విధానంపైన అధ్యాపకులు మరింత అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులతో నూతన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి వీలవుతుందన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తాడిపత్రి అర్బన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అర్బన్ పోలీసులు శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ధరణీబాబు తెలిపిన వివరాలు.. పట్టణంలోని రామచంద్రలాడ్జి సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. తాడిపత్రి నుంచి అనంతపురం వైపు వెళుతున్న ఏపీ02 టీఈ 0826 నంబరు గల బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని గుర్తించారు. డ్రైవర్ శివ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా యల్లనూరుకు చెందిన శివకుమార్ తాడిపత్రి నుంచి కర్ణాటకకు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలించే వ్యాపారం చేస్తున్నట్లు తేలింది. అందులోని 60 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని బొలెరో వాహనంతో పాటు డ్రైవర్ శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

పెద్దపప్పూరు: మండలంలోని దేవునిఉప్పలపాడు, కమ్మవారిపల్లి,కొట్టాలపల్లి, పసలూరు, సుంకేసులపల్లి, పెద్ద యక్కలూరులో విద్యుత్ సిబ్బంది కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ప్రజాసంక్షేమ, జన చైతన్య యాత్రల సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్‌స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన విద్యుత్ అధికారులకు సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. మండలవ్యాప్తంగా దాదాపు 140 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు ఏఈ నరసింహులు తెలిపారు.


కరెంటు స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

క్లాప్ ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు: క్లాప్ ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్లు సామూహిక దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ ఆటోడ్రైవర్లకు దాదాపు 5 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి వెంటనే జీతాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు బి.మహేష్, ఎస్.గోపీనాథ్, టీ.సురేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న ఆరుగురిని అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. వివిధ ప్రాంతాల్లో మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తన సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. బంకమడి వీధికి చెందిన కల్లూరు ఖాజామొహిదీన్, షేక్ మహబూబ్‌బాషా, కట్టుబడి మున్నా, శివాలయం వీధికి చెందిన షేక్‌మస్తాన్, సీపీఐ కాలనీకి చెందిన మేహత్తార్ సలీం, కాల్వగడ్డ వీధికి చెందిన నూర్ల హనీఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. రూ.3,10,000 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పట్టణంలో ఎక్కడైనా మట్కా నిర్వహిస్తే వెంటనే 9440796861 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

వృద్ధురాలి బలవన్మరణం

పామిడి: వృద్ధురాలు బలవన్మరణం పొందిన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని అనుంపల్లికి చెందిన బోయ రాములమ్మ (65), బోయ కదిరప్ప దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. గతంలోనే పెద్ద కుమార్తె మృతి చెందింది. చిన్న కుమార్తెను పామిడిలోని కాగితాలవీధికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేయగా, ఆయన కూడా కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. ఇటీవల భర్త కదిరప్ప మృతి చెందడంతో, ఊళ్లో ఒంటరిగా ఉండలేక మండలకేంద్రంలోని కుమార్తె ఇంటికి వచ్చింది. భర్త, కుమార్తె, అల్లుడి మృతితో మానసిక వేదనకు గురై అనారోగ్యం పాలైంది. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున పురుగుల మందు తాగింది. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స ఫలించక ఆస్పత్రిలో వృద్ధురాలు కన్నుమూసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


తక్షణసాయం అందిస్తున్న సర్పంచ్ పార్వతి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని గాంధీ నగర్ కాలనీకి చెందిన సాకే కళావతమ్మ గుండెపోటుతో మృతి చెందింది. దీంతో శనివారం వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలను సర్పంచు పార్వతి మృతురాలి కుమార్తె రాజేశ్వరికి అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ రమణ ఉన్నారు.

11న విశ్వరూప మహాసభ

తాడిపత్రిటౌన్: ఈ నెల 11న హైదరాబాద్ విశ్వరూప మహాసభను నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. మండలంలోని తేరన్నపల్లిలో శనివారం ప్రచారయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారన్నారు. పెద్ద ఎత్తున మాదిగలు తరలిరావాలని కోరారు. మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెద్దిరాజు, రాష్ట్ర నాయకులు ఆదినారాయణ, పెద్దపప్పూరు, తాడిపత్రి మండలాధ్యక్షులు కంబగిరి, వెంకటేష్, నాయకులు రామాంజనేయులు ,రామాంజి, శివ మారెప్ప పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదకరం

బుక్కరాయసముద్రం: అతివేగం ప్రమాదకరమని, వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని అనంతపురం– తాడిపత్రి రహదారిపై సీఐ ఎస్ఐ శ్రీనివాసులుతో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు వేగంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. ద్విచక్ర వాహన దారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

స్కూటర్ యాత్ర జయప్రదం చేయండి

తాడిపత్రి అర్బన్: జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం తలపెట్టిన స్కూటర్ యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. శనివారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ 6న బుక్కరాయసముద్రం నుంచి తాడిపత్రికి స్కూటర్ యాత్ర చేరుకుంటుందన్నారు. యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. నాయకులు నాగరాజు, హనుమంతరెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్ అలెగ్జాండర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

యాడికి: తాడిపత్రికి బదిలీపై వెళ్లిన తహసీల్దార్ అలెగ్జాండర్‌ను శనివారం మండల కేంద్రంలో రెవెన్యూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రేషన్ డీలర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు అలెగ్జాండర్ సేవలను కొనియాడారు. తహసీల్దార్ బాలమ్మ, సీఎస్ డీటీ సూర్యనారాయణ, రీసర్వే డీటీ రాజ్‌కుమార్, ఆర్ఐ ఆనందబాబు ఆచారి, వీఆర్వోలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన వీఆర్‌ఏ సంఘం సభ్యులు


ఆర్డీఓను సన్మానిస్తున్న వీఆర్‌ఏల సంఘం సభ్యులు

గార్లదిన్నె: అనంతపురం ఆర్డీఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్‌ను శనివారం రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్డీఓకు పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, సభ్యుడు వెంకటరాముడు, జిల్లా అధ్యక్షుడు వెంకట రజనికుమార్ తదితరులు పాల్గొన్నారు.

7న విద్యుత్ లోక్ అదాలత్

పెద్దపప్పూరు: ఈనెల 7న గుత్తి ట్రాన్స్‌కో కార్యాలయంలో విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎతఈ నరసింహులు శనివారం తెలిపారు. మండల వ్యాప్తంగా వినియోగదారులు ఎటువంటి సమస్య ఉన్నా అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు.

అనుమతి గోరంత.. తవ్వేది కొండంత!

- మట్టి తవ్వకాలపై కొరవడిన నిఘా
- రెచ్చిపోతున్న రవాణాదారులు

తాడిపత్రిటౌన్: మండలంలో మట్టి తవ్వకాలు అడ్డుగోలుగా సాగుతున్నాయి. సరిహద్దులు దాటి సాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అనుమతులు గోరంత అయితే తవ్వకాలు కొండంత జరుగుతున్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. తాడిపత్రి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు మండలంలోని పెద్దపొడమల, ఆలూరు, సరిహద్దు మండలాలైన పెద్దపప్పూరు మండలం అమ్మలదిన్నె, పుట్లూరు మండలం చింతకుంట గ్రామాలకు సంబంధించిన ప్రభుత్వ భూముల్లో(కొండ ప్రాంతాలు) మట్టి తవ్వకాలకు అధికారులు అనుమతులు ఇచ్చారు. ఆలూరు వద్ద సర్వేనెంబర్ 18లో 1.618 హెక్టార్లు, చింతకుంట వద్ద సర్వేనెంబర్ 01లో 3.134 హెక్టార్లు, పెద్దపొడమల వద్ద సర్వే నంబర్ 1390లో 2 హెక్టార్లు, అమ్మలదిన్నె వద్ద సర్వే నంబర్ 79లో 1.012 హెక్టార్లలో తవ్వకాలకు అనుమతులున్నాయి. అయితే ఆయా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో తవ్వకాలు ఇష్టానుసారంగా జరుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. విచ్చలవిడిగా కొండ ప్రాంతంలో మట్టిని తోడేయడం వల్ల ఆయా గ్రామాల్లో పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని చెబుతున్నారు. రానున్న రోజుల్లో పశుగ్రాసం కోసం తిప్పలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


యర్రగుంటపల్లి సమీపంలో మట్టి తవ్వకాలు జరుగుతున్న దృశ్యం

ప్రమాదకరంగా మారిన మట్టి రవాణా

కొండ ప్రాంతం నుంచి మట్టి రవాణా ఇష్టానుసారంగా మారింది. మట్టితో వెళ్తున్న వాహనాల నుంచి వెలువడే దుమ్ము ఇతర వాహనాలకు ప్రమాదకరంగా మారింది. అధిక లోడుతో వెళ్తుండటంతో రోడ్డుపై మట్టి పెళ్లలు పడుతున్నాయి. దీంతో ఇతర వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హద్దులు దాటిన మట్టి తవ్వకాలపై నిఘా ఉంచి నియంత్రించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.